విద్యా వ్యాపారం



- ప్రైవేటు పాఠశాలల్లో నిబంధనలు బేఖాతర్
- కనీస సౌకర్యాలు కల్పించని యాజమాన్యాలు
- క్వాలిఫికేషన్ లేని టీచర్లతో క్లాసులు!
- అనుమతి లేకున్నా నడుస్తున్న పలు స్కూళ్లు

ములుగు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు విద్యా సంస్థల నిర్వహణ జిల్లాలో అస్తవ్యస్తంగా మారింది. ఫీజులు వసూలు చేయడంపై చూపుతున్న శ్రద్ధ విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో యాజమాన్యాలు కనబర్చడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. పలు పాఠశాలల్లో అర్హత, అనుభవం లేని ఉపాధ్యాయులతో విద్యాబోధన చేయిస్తున్నారనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. అత్యధిక ప్రైవేటు పాఠశాలల్లో ఎలాంటి నిబంధనలు పాటించడం లేదని తెలుస్తోంది.

జిల్లాలో 40 ప్రైవేటు పాఠశాలలు

ములుగు జిల్లాలో 40 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 14 అప్పర్ ప్రైమరీ ఉండగా 26 హైస్కూల్స్ ఉన్నాయి. ములుగు మండలంలో 14 ప్రైవేటు పాఠశాలలు, మంగపేట మండలంలో ఆరు, గోవిందరావుపేట మండలంలో ఐదు, వెంకటాపురం మండలంలో ఐదు, ఏటూరునాగారం మండలంలో మూడు, వెంకటాపూర్ మండలంలో మూడు, తాడ్వాయి మండలంలో రెండు, వాజేడు మండలంలో ఒకటి, కన్నాయిగూడెం మండలంలో ఒకటి నడుస్తున్నాయి. వీటిలో మొత్తం 11,894 మంది విద్యార్థులు చదువుతున్నట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే... ఈ విద్యార్థుల తల్లిదండ్రులు వేలాది రూపాయల ఫీజులు చెల్లిస్తున్నా స్కూల్ యాజమాన్యాలు అందుకు తగ్గ సౌకర్యాలు కల్పించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఇరుకైన తరగతి గదులతో చిన్న భవనాల్లో అత్యధిక పాఠశాలల నిర్వహణ సాగుతోందని తెలుస్తోంది. పిల్లలు ఆడుకొనేందుకు కనీసం క్రీడా మైదానం కూడా ఉండటం లేదు. ఇదే కాదు... చాలా వరకు పాఠశాలల్లో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం కూడా ఉండటం లేదనే విమర్శలు వస్తున్నాయి. దీంతో తమ పిల్లలు అవస్థల మధ్య చదుకోవాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చదువులతో చెలగాటం

అర్హత, అనుభవం అక్కర్లేదా..?

జిల్లాలోని పలు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అనుభవం, అర్హత లేని ఉపాధ్యాయులతో విద్యా బోధన కొనసాగిస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యను వ్యాపారంగా చేసుకుని కొందరు తక్కువ జీతానికి అర్హత లేని టీచర్లను నియమిస్తున్నారని పలువురు చెబుతున్నారు. కనీస అర్హత లేని వారిచేత పాఠాలు చెప్పిస్తుంటే విద్యా మౌలిక సూత్రాలు, బోధనా నైపుణ్యాలు, పాఠ్యంశాలు సరిగా అర్థం చేసుకోలేక విద్యార్థులు సతమతమవుతున్నారని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు బోధించాల్సిన టీచర్లకు కనీసం డీఈడీ, టెట్ పేపర్-1 విద్యార్హత ఉండాలని నిబంధనలు చెబుతున్నాయి. ఆరు నుంచి పదో తరగతి వరకు పాఠాలు బోధించే వారు బీఈడీ, టెట్ పేపర్-2 క్వాలిఫై అయ్యుండాలి. అయితే.. జిల్లాలోని 40 పాఠశాలల్లో టీచర్లుగా పనిచేస్తున్న ఎంత మందికి ఈ అర్హతలు ఉన్నాయనే ప్రశ్నలు విద్యార్థి సంఘాల నుంచి ఉత్పన్నమవుతున్నాయి. పలు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు లాభాపేక్షే ధ్యేయంగా విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడుతున్నారని మండిపడుతున్నారు.

నిబంధనలు గాలికి..

ములుగు జిల్లాలోని పలు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు కనీస నిబంధనలను పాటించడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెండంతస్తులు, ఆపైన ఉన్న భవనాల్లో నడుస్తున్న పాఠశాలలకు తప్పని సరిగా ఫైర్ అధికారి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే.. జిల్లాలోని పలు పాఠశాలలో ఫైర్ సేఫ్టీ పరికరాలు కనిపించడం లేదని తెలుస్తోంది. వైద్య ఆరోగ్య శాఖ నుంచి శానిటేషన్ అనుమతులు, ఇంజనీరింగ్ శాఖ నుంచి సౌండ్‌నెస్ అనుమతులు, రవాణా శాఖ నుంచి బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాల్సి ఉంది. అలాగే ఫీజులు, పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల క్వాలిఫికేషన్, అనుభవం తదితర వివరాలను పాఠశాల ఆవరణలో (మిగతా 8వ పేజీలో)

కలెక్టర్లు కీలకంగా వ్యవరించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు పొంగులేటి, పొన్నం, సురేఖ, అడ్లూరి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




పాల్గొన్న భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్/ములుగు కలెక్టరేట్, జూలై 22(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాల అమలులో కలెక్టర్లు కీలకంగా వ్యవహరించాలని మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వివిధ శాఖల ముఖ్యకార్యదర్శు, కార్యదర్శులతో కలిసి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూపాలపల్లి నుంచి కలెక్టర్ రాహుల్ శర్మ, ములుగు నుంచి దివాకర పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ప్రజాపాలనలో సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఈ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిందని, క్షేత్రస్థాయిలో కలెక్టర్, అధికారులు ముఖ్యపాత్ర పోషించాలన్నారు. సాంఘిక, బీసీ, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు పెంచిన డైట్ చార్జీలకనుగుణంగా నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, హాస్టళ్ల నిర్వహణపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి వారంలో ఒకరోజు అధికారులందరూ హాస్టళ్లలో బస చేయాలని అన్నారు. హాస్టళ్ల ప్రాంగణాల్లో పచ్చదనం, పరిశుభ్రతల్లో భాగంగా శానిటేషన్ చేపట్టాలని, ఎగ్ టెండర్స్ ప్రక్రియను త్వరలో పూర్తి చేయాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో నెలకోసారి సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులను ఇబ్బంది పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆగస్టు 15 నాటికి భూభారతి దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. తిరస్కరణకు గురైన దరఖాస్తులపై సరైన కారణాలు చూపాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పేదలకు ఎలాంటి సమస్యలు ఎదురుకాకుండా చూడాలన్నారు. లబ్ధిదారులకు ఆయా రీచ్‌ల నుంచి ఉచితంగా ఇసుక పంపిణీ చేయాలని సూచించారు. భూభారతి చట్టం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత కలెక్టర్లదే అన్నారు. ఈనెల 30లోగా జిల్లాల్లోని అసైండ్ లబ్ధిదారుల వివరాలను ప్రభుత్వానికి పంపాలని సూచించారు. ఈనెల 27న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న లైసెన్స్‌డ్ సర్వేయర్ల పరీక్షకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా (మిగతా 8వ పేజీలో)



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ములుగు కలెక్టర్ దివాకర

27న భూపాలపల్లికి కేటీఆర్



కృష్ణకాలనీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామరావు (కేటీఆర్) భూపాలపల్లిలో ఈనెల 27న పర్యటించనున్నారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మంగళవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. భూపాలపల్లికి రానున్న కేటీఆర్ బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో సమావేశమవుతారని తెలిపారు. అనంతరం మొగుళ్లపల్లి మండలంలోని ఇస్సిపేట మాజీ సర్పంచ్ కొమురయ్య విగ్రహ ఆవిష్కరణలో పాల్గొంటారన్నారు. నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వెంకటరమణారెడ్డి తెలిపారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య



లింగయ్య (ఫైల్)

కృష్ణకాలనీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన భూపాలపల్లి మండలం వేషాలపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన కడారి లింగయ్య (70) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. దీన్ని భరించలేక పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. అప్పటికే లింగయ్య మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమారుడు రాజ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

మేడిగడ్డ బ్యారేజీకి పెరుగుతున్న వరద

మహదేవపూర్ రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. బ్యారేజీలోకి 98,440 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 2.10 మీటర్లు నమోదైంది.

ములుగు జిల్లాలో మోస్తరు వర్షం

ములుగు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం మోస్తరు వర్షాలు కురిసాయి. ములుగు, మంగపేట, ఏటూరునాగారం, వెంకటాపురం, గోవిందరావుపేట, వెంకటాపూర్, వాజేడు మండలాల్లో కొద్దిసేపు తేలికపాటి వర్షాలు కురిసాయి. మరో రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెప్పింది. ఇంతకాలం వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతులకు మంగళవారం కాస్త ఉపశమనం కలిగించింది.

భారీ వానలు ఉన్నాయి.. జాగ్రత్త : కలెక్టర్



ములుగు కలెక్టరేట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ దివాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, పిడుగుపాటుకు గురికాకుండా తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సూచనలు, సలహాల నివృత్తి కోసం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన టోల్‌ఫ్రీ నంబర్ 18004257109కు కాల్ చేయాలని తెలిపారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతుండగా వ్యవసాయ క్షేత్రాలు, చెట్లకింద ఎవరూ ఉండొద్దని సూచించారు.



తాడ్వాయిలో లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న మంత్రి సీతక్క

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- అర్హులందరికీ కొత్త రేషన్‌కార్డులు
- పేదలకు మూడు పూటలా కడుపు నింపాలన్నదే సర్కారు లక్ష్యం
- మహిళలు స్వయం సహాయక సంఘాల్లో చేరాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క

కన్నాయిగూడెం, జూలై 22(ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మండలంలో ఆమె మంగళవారం పర్యటించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబం సన్నబియ్యం తినాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సన్న బియ్యం అందిస్తున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో కొత్త రేషన్‌కార్డులు మంజూరు కాలేదన్నారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో మంజూరయ్యాయన్నారు. మళ్లీ ఇప్పుడు ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి అర్హులందరికీ రేషన్‌కార్డులు అందిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. రేషన్‌కార్డుల మంజూరు ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతోందని, అర్హులందరికీ అందుతాయని స్పష్టం చేశారు. పేదలకు న్యాయం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సి.హెచ్ మహేందర్‌జీ, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎం.డి. అఫ్సర్‌పాషా, మండల ఇన్‌చార్జి జాడి రాంబాబు, తహసీల్దార్ సర్వర్, ఆర్‌ఐ గణేష్, సీఐ శ్రీనివాస్, ఎస్సై వెంకటేశ్ పాల్గొన్నారు.

మహిళలు స్వావలంబన సాధించాలి

తాడ్వాయి (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వావలంబన సాధించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మండలంలో పర్యటించిన ఆమె 1,299 మందికి కొత్త రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి మహిళా స్వయం సహాయక సంఘాల్లో చేరాలని సూచించారు. మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వం అనేక పథకాలను అందిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సి.హెచ్.మహేందర్ జీ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్‌బాబు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, నాయకులు బొల్లు దేవేందర్, అనంతరెడ్డి, ఇప్ప నాగేశ్వరావు, పులి సంపత్, పాక సాంబయ్య, అర్రెం లచ్చుపటేల్, సునీల్, మంకిడి నర్సింహస్వామి, సతీష్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికంగా ఎదగాలి...

మంగపేట (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు పొంది లాభదాయక వ్యాపారులతో ఆర్థికంగా ఎదగాలని మంత్రి సీతక్క అన్నారు. ఇందుకు అవసరమైతే ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. మండలంలో మంత్రి పర్యటించారు. మంగపేటలోని రైతు వైదిక భవనంలో కొత్త రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. మంగపేటలోని తెలంగాణ సెంటర్‌లో ఏర్పాటు చేసిన నాబార్డు, రైతు సహక సంఘం మార్కెట్ గోడౌన్, మండలంలోని రాజుపేటలోని షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తలను కలిసి పార్టీనీ బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. మంత్రి వెంట అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో భద్రు, సహకార సంఘం చైర్మన్ తోట రమేష్, వైస్ చైర్మన్ నరేందర్ యాదవ్, సహకార సంఘం డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధికి చర్యలు

- కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి జితిన్ ప్రసాద్
- ఎంపీ డాక్టర్ కడియం కావ్య ప్రశ్నకు వివరణ ఇచ్చిన మంత్రి



పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య

హనుమకొండ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కేంద్ర పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక శాఖ మంత్రి జితిన్ ప్రసాద్ లోక్‌సభలో వెల్లడించారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆయన వివరణ ఇచ్చారు. పారిశ్రామిక వృద్ధిని వేగవంతం చేయడం, పెట్టుబడులను ఆకర్షించడం, స్థానికులకు ఉద్యోగ అవకాశాలను కల్పించడం లక్ష్యంగా కారిడార్లు కీలకపాత్ర పోషిస్తున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుంటూ వ్యూహాత్మక ప్రణాళికను అమలు చేయడం ద్వారా పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రాజెక్టుల స్థితిగతులు, అమలులో ఉన్న కార్యాచరణ ప్రణాళికల పురోగతిపై త్వరలో మరింత సమాచారం వెల్లడిస్తామన్నారు. కారిడార్ల అభివృద్ధి పారిశ్రామిక కనెక్టివిటీని మెరుగుపరచడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ సమగ్ర ఆర్థిక దృక్పథానికి అనుగుణంగా సాగుతోందన్నారు. పారిశ్రామిక కారిడార్ల పురోగతిపై కేంద్రం నిరంతరం రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయాన్ని కొనసాగిస్తోందని మంత్రి తెలిపారు. ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పందిస్తూ.. తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి కేంద్ర సహకారం కొనసాగాలని ఆకాంక్షించారు. పారిశ్రామిక కారిడార్ల ద్వారా యువతకు ఉపాధి అవకాశాలతో పాటు ప్రాంతీయ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

'జిజ్ఞాస'కు జూకల్లు విద్యార్థుల ఎంపిక

చిట్యాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే జిజ్ఞాస కార్యక్రమానికి మండలంలోని జూకల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. కర్ణాటక రాష్ట్రం మైసూర్‌లోని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ ఇండస్ట్రీయల్ రీసెర్చ్ సెంటర్ ల్యాబ్‌లో శాస్త్రవేత్తలతో ప్రత్యక్ష్యంగా చర్చించేందుకు, సలహాలు, సూచనలు తీసుకునేందుకు మంగళవారం బయలుదేరినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గిరగాని కృష్ణ తెలిపారు. ఆన్‌లైన్ పరీక్షలో ఉత్తమ ప్రతిభను కనబర్చిన పదో తరగతి విద్యార్థులు ఇంద్రపాల శైలేంద్రనాథ్, జంపుల సౌమిత్, ఎనిమిదో తరగతి విద్యార్థులు మామునూరి నిశాంత్, కౌటం అభిలాష్‌కు ఈ అవకాశం దక్కిందని అన్నారు.

శాశ్వత ఆధార్ కేంద్రాలేవి ?

- ఐదు మండలాల్లో కానరాని సెంటర్లు
- అప్‌డేట్‌కు తప్పని తిప్పలు
- అవస్థలు పడుతున్న ప్రజలు

వివరాలు 6వ పేజీలో...




కేసముద్రంలో రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

పదేళ్ల తర్వాత రేషన్‌కార్డులు మంజూరు

- మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : గత బీఆర్ఎస్ పాలనలో రేషన్‌కార్డుల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూశారని, సీఎం రేవంత్ సారథ్యంలోని ప్రజాప్రభుత్వంలో కొత్త రేషన్‌కార్డులను పొందుతున్నారని ఎమ్మెల్యే మురళీ నాయక్ అన్నారు. మండలంలోని 32 మంది రేషన్‌డీలర్ల పరిధిలో 4,839 కొత్త రేషన్‌కార్డులు మంజూరయ్యాయి. కేసముద్రం రైతువేదికలో మంగళవారం లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గత ప్రభుత్వంలో రేషన్‌షాపుల్లో ఇచ్చిన దొడ్డు బియ్యం తినలేక ఇబ్బందులు పడ్డారని, కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియ్యం అందిస్తోందన్నారు. 200 యూనిట్ల ఉచిత కరెంటును రేషన్ కార్డుదారులు పొందుతున్నారని, ఉచిత బస్సు సౌకర్యాన్ని మహిళలు వినియోగించుకుంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, తహసీల్దార్ వివేక్, ఎంపీడీవో కాంత్రి, ఆర్‌టీఏ సభ్యుడు రావుల మురళి, సొసైటీ ఉపాధ్యక్షులు అంబటి మహేందర్‌రెడ్డి, అల్లం నాగేశ్వర్‌రావు, ఏఎంసీ డైరెక్టర్లు వోలం రమేష్, చింతకుంట్ల యాదగిరి కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

యాంత్రీకరణపై అవగాహన పెంచుకోవాలి

- మహబూబాబాద్ డీఏవో అజ్మీరా శ్రీనివాసరావు


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఏవో శ్రీనివాసరావు

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : రైతులు వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలు, యాంత్రీకరణపై అవగాహన పెంపొందించుకోవాలని ఇన్‌చార్జి డీఏవో అజ్మీరా శ్రీనివాసరావు అన్నారు. మహబూబాబాద్ మండలం జంగిలిగొండలో మంగళవారం మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం, జిల్లా వ్యవసాయశాఖ,జిల్లా ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయంలో నూతన వంగడాలనుఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించారు. మల్యాల కేవీకే శాస్త్రవేత్త క్రాంతికుమార్ మాట్లాడారు. తక్కువ మోతాదులో యూరియా వాడాలని, వరిలో స్వల్పకాలిక సన్న రకాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు అశ్విని, సుహాసిని, ఏవో ఎస్.తిరుపతిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు. అభ్యుదయ రైతు పురుషోత్తంరెడ్డిని అయిల్‌పామ్ సాగు చేసినందుకు ఆయనను సన్మానించార కార్యక్రమంలో ఏఈవో షహీనా, కార్యదర్శి నగేష్, అయిల్‌ఫెడ్ మానిటరింగ్ అధికారి కరుణాకర్, శ్రీకాంత్, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

పోక్సో కేసులో జైలు శిక్ష, జరిమానా

నర్సింహులపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : నర్సింహులపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో పోక్సో కేసులో నిందితుడికి కోర్టు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మానికి చెందిన బానోతు నవీన్‌పై 2021లో మండలంలో పోక్సో కేసు నమోదు కాగా, మహబుబాబాద్ కోర్టు మంగళవారం నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.17వేల జరిమానా విధించినట్లు ఎస్సై చెప్పారు.

కొడుకుపై వేడి నూనె పోసిన తల్లి

- మద్యానికి బానిసై ఇంటిస్థలం అమ్మడంతో ఆగ్రహం
- గూడూరు మండలం చంద్రుగూడెంలో ఘటన

మహబూబాబాద్ క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై ఇంటి స్థలం అమ్ముకున్న కొడుకుపై ఆగ్రహంతో కన్నతల్లి సలసల కాగే వేడినూనె పోసిన ఘటన మహబూబాబాద్ జిల్లాలో మంగళవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గూడూరు మండలం చంద్రుగూడెం గ్రామానికి చెందిన పాడాల మల్లయ్య - అనసూర్య దంపతులకు నలుగురు కూతుళ్లు కావడంతో శ్రీనివాస్‌ను దత్తత తీసుకున్నారు. నలుగురు కూతుళ్లకు వివాహం చేసిన అనంతరం దత్తత కుమారుడు పాడాల శ్రీనివాస్‌కు పదేళ్ల క్రితం సూర్యాపేట జిల్లా ముకుందాపురం గ్రామానికి చెందిన సరితతో పెళ్లి చేశారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. 15 ఏళ్ల క్రితం తండ్రి మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి శ్రీనివాస్ మద్యానికి బానిసై ఇంటికి వచ్చి తరుచూ భార్య సరితతో ఘర్షణ పడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో విసుగు చెందిన భార్య సరిత మూడేళ్ల క్రితం ఇద్దరు పిల్లలతో హైదరాబాద్‌కు వెళ్లి అక్కడే ఉంటుంది. చంద్రుగూడెంలో వృద్ధురాలు తల్లి అనసూర్యతో ఉంటున్న శ్రీనివాస్ ఇటీవల ఎవరికి తెలియకుండా రెండు గుంటల ఇంటిస్థలం విక్రయించాడు. దీంతో ఆగ్రహించిన తల్లి అనసూర్య మద్యం మత్తులో ఉన్న కుమారుడు శ్రీనివాస్‌పై కాగే నూనె పోయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని మహబూబాబాద్ జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గూడూరు సీఐ సూర్యప్రకాష్ తెలిపారు. కాగా మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి స్వాతిమురారి బాధితుడి నుంచి వాంగ్మూలం రికార్డు చేసుకున్నారు.


మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనివాస్

విజ్ఞానాన్ని పెంచుకోవాలి

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క
- ములుగులో జిల్లా గ్రంథాలయం ప్రారంభం

ములుగుటౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు సరస్వతి నిలయాలని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. ములుగు జిల్లా కేంద్రంలో నూతన గ్రంథాలయ భవనాన్ని మంత్రి సీతక్క మంగళవారం ప్రారంభించారు. రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్, ములుగు జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్‌లతో కలిసి పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో డీసీసీ బ్యాంక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులకు గ్రంథాలయాలను సరసతీ నిలయాలుగా భావించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యోగార్థులకు లైబ్రరీలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ములుగు గ్రంథాలయ భవనాన్ని రూ. 25 లక్షలతో నిర్మించామని తెలిపారు. గ్రంథాలయం ఆవరణలో ఆహ్లాదకర పుస్తక పఠనం కోసం రూ. 10లక్షలతో పలు రకాల చెట్లు నాటించామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, పీఏసీఎస్ చైర్మన్ బొక్క సత్తిరెడ్డి, అదనపు కలెక్టర్ మహేందర్ జీ, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.అలివేలు, మునిసిపల్ కమిషనర్ సంపత్, డీసీవో సర్దార్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.


ములుగులో జిల్లా గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఏటూరునాగారం రూరల్ (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మండల కేంద్రంలో నిర్మించిన డీసీసీ బ్యాంక్ భవనాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు మెరుగైన సేవలందించేందుకు డీసీసీ బ్యాంక్ సహకారం ఉంటుందన్నారు. దీని ద్వారా రైతులకు వ్యవసాయ, కర్షక మిత్ర, విద్యా రుణాలు, బంగారు రుణాలను అందిస్తారన్నారు. రైతుల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. రైతుల రుణాలను మాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదేనని కొనియాడారు. సన్నవడ్లు పండించిన రైతులకు రూ. 500 బోనస్‌పాటు రైతు భరోసాను అందిస్తున్నమని తెలిపారు. అనంతరం ఆయా రుణాలకు సంబంధించిన చెక్కులను రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌తో కలిసి మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, డీసీవో సర్దార్‌సింగ్, జిల్లా గంథ్రాలయ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, పీఏసీఎస్ చైర్మన్ కూనూర్ అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై మంత్రి ఆగ్రహం

మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో మంత్రి సీతక్క రేషన్ కార్డులను పంపిణీ చేశారు. గిరిజన భవన్‌లో ఏర్పాట్లపై స్థానిక తహసీల్దార్ జగదీశ్వర్‌పై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. లబ్ధిదారులు లేకుండా రేషన్ కార్డులను ఎవరికి ఇస్తారని ప్రశ్నించారు. లబ్ధిదారులందరినీ ఎందుకు పిలువలేదని మందలించారు.

'దేవాదుల' సెంట్రల్ నోడల్ అధికారిగా ఆశిష్ సక్సేనా

హనుమకొండ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం సెంట్రల్ నోడల్ అధికారిగా కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ డిప్యూటీ సెక్రెటరీ ఎస్‌హెచ్ ఆశిష్ సక్సేనా నియమితులయ్యారు. ప్రస్తుతం ఉన్న పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రెటరీ పదంలాల్ నేగి స్థానంలో ఆయన నియమితులయ్యారు. సక్సేనా హనుమకొండ, జనగామ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని ఈ ప్రాజెక్టు వ్యవహారాలను పర్యవేక్షిస్తారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ప్రధానమంత్రి కృషి సంచాయి యోజన (పీఎంకేఎస్‌వై), జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పరిధిలో ఉన్న దేవాదుల ప్రాజెక్టు ద్వారా ప్రస్తుతం అందుతున్న సాగునీటిని మరింత సమర్థవంతంగా ఉపయోగించేందుకు తీసుకోవలసిన చర్యలను సెంట్రల్ నోడల్ అధికారిగా సక్సెనా కేంద్రానికి సూచిస్తారు. ప్రతీ నీటిబొట్టుతో ఎక్కువ పంటను ఉత్పత్తి చేయడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి దోహదపడడం వంటి బాధ్యతలను నిర్వర్తిస్తారు. అలాగే జల్ జీవన్ మిషన్ కిందకు కూడా తీసుకువచ్చిన దేవాదుల ప్రాజెక్టు ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం, పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించడం, ప్రాజెక్టు రైతులకు మరింత ఎక్కువ ప్రయోజనం కలిగించేట్టు చూడడం వంటి మౌలిక విధులను నిర్వర్తిస్తారు. దేవాదుల ప్రాజెక్టు హనుమకొండ, వరంగల్, కరీంనగర్, ములు గు, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, యాదాద్రి, సూర్యాపేట, సిద్దిపేట జిల్లాల్లోని 2.48 లక్షల హెక్టార్లకు సాగునీరందించడానికి ఉద్దేశించింది. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.13580.63కోట్లు. ఈ ప్రాజెక్టు వాస్తవానికి 2025 నాటికి పూర్తి చేయాలని నిర్ణయించినా 2027 మార్చి నాటికి పూర్తవుతుందని అంచనా. ప్రాజెక్టు మిగిలిపో యిన పనుల సత్వర పూర్తికి సెంట్రల్ నోడల్ ఆఫీసర్ మార్గదర్శనం చేస్తారు.

ప్రతిభ చాటిన మానుకోట పోలీసులు

మహబూబాబాద్ క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జోన్ పరిధిలో జరిగిన పోలీస్ డ్యూటీ మీట్‌లో జిల్లాకు చెందిన పది మంది పోలీసులు ప్రతిభ చాటి 17 పతకాలు సాధించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ మంగళవారం వారిని ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ.. భద్రాద్రి జోన్ డ్యూటీ మీట్‌లో మరిపెడకు చెందిన ఎమ్డీ అబ్దుల్‌ఖదీర్ కంప్యూటర్ అవర్నెస్ ప్రోగ్రాంలో గోల్డ్, బ్రాంజ్ మెడల్స్ సాధించడం అభినందనీయమన్నారు. విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తేనే సమాజంలో గౌరవ మర్యాదలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, ప్రతాప్, తిరుపతి, సీఐ చంద్రమౌళి, ఉపేందర్, సర్వేష్, ఆర్ఐ నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.


కానిస్టేబుల్‌ను సన్మానిస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మానుకోట జిల్లాకు దాశరథి పేరు పెట్టాలి


దాశరథి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తెలంగాణ రచయితల వేదిక బాధ్యులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాకు దాశరథి కృష్ణమాచార్యుల పేరు పెట్టాలని తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు గుర్రపు సత్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో దాశరథి కృష్ణమాచార్యుల శతజయంతి వేడుకల్లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నా తెలంగాణ కోటి రతనాల వీణ గొప్ప కవితా వాక్యం అని కారాగారం మీద బొగ్గుముక్కతో రాసిన ఈ నినాదం ఎన్ని దశాబ్దాలు గడిచిన ప్రచుర్యంలో ఉందని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి కవి, రచయిత కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాణాల వీరయ్య, రేణిగుంట్ల లక్ష్మీకాంతారావు, బొడ్డుపల్లి వీరస్వామి, రవీందర్, గందసిరి వేణు, సోమ నాగన్న, పరికిపండ్ల అశోక్, శ్యామ్‌గౌడ్ పాల్గొన్నారు.

● జిల్లా కేంద్రంలోని నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దాశరథి జయంతి వేడుకలను పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మణ్‌నాయక్, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్. శ్రీనివాసులు, అధ్యాపకులు అనిల్‌కుమార్, మసూద్ అహ్మద్, సాంబశివరావు, వినోద్‌కుమార్, బి. శ్రీనివాస్, అన్నపూర్ణ, రాజశేఖర్, కాశీం, హతీరాం, సుమన్, ఉపేందర్, రామన్న, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మానుకోట గురుకులంలో విద్యుత్ షాక్

- ముగ్గురు విద్యార్థులకు గాయాలు

మహబూబాబాద్ క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కేంద్రం పత్తిపాక రోడ్‌లోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతం జరగడంతో ముగ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ పట్టణ శివారు పత్తిపాకకు వెళ్లే దారిలో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాల వసతి గృహం భవనంపైన పలువురు విద్యార్థులు స్టడీ అవర్‌లో చదువుకుంటున్నారు భవనం ఒక్కసారిగా ఎర్త్‌కు గురికావడంతో ఈ క్రమంలో ఒక్కసారిగా ఎనిమిదో తరగతి విద్యనభ్యసిస్తున్న సాయిచరణ్, జి హేమంత్, టి. సిద్దార్థలు విద్యుదాఘాతానికి గురయ్యారు. తక్షణమే అప్రమత్తమైన ఆశ్రమ పాఠశాల సిబ్బంది ముగ్గురు విద్యార్థులను జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ప్రాణాపాయం ఏమీ లేదని ఆస్పత్రి డ్యూటీ డాక్టర్ రాంరెడ్డి తెలిపారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7820	5300
మక్కలు	2355	1521
కందులు	5966	3022
పెసళ్లు	7002	3022
పల్లికాయ (సూక)	5800	3450
పల్లికాయ (పచ్చిది)	4800	1575
పసుపు (కాడి)	10299	9534
పసుపు (గోల)	10000	9700
తేజ మిర్చి	8000	8500
తేజ ఏసీ	13500	11500
వండర్‌హాట్	10000	6000
వండర్‌హాట్ ఏసీ	14000	11500
యూఎస్341 ఏసీ	13000	7000
దీపిక	9000	8000
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

మరిపెడ మీదుగా త్వరలో రెండు ఫోర్‌లేన్ రోడ్లు



మరిపెడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ మీదుగా త్వరలో రెండు ఫోర్‌లేన్ రోడ్లు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దేశ వ్యాప్తంగా 10వేల కిలోమీటర్ల డబుల్ రోడ్లను ఫోర్‌లేన్ రోడ్లుగా విస్తరించే ప్రక్రియను ఇటీవల కేంద్ర మంత్రి గడ్కరి ప్రకటించారు. అందులో రాష్ట్రంలోని 15 రోడ్లను ఫోర్‌లేన్ రోడ్లుగా విస్తరించనున్నారు. మరిపెడ మీదుగా వరంగల్ నుంచి ఖమ్మం వెళ్లే 653 హైవే 119 కిలోమీటర్లు, నకిరేకల్ నుంచి మేడారం వరకు వెళ్లే 365 జాతీయ రహదారి సైతం కేంద్రం ప్రకటించిన జాబితాలో ఉండడం ఈ ప్రాంత ప్రజలను ఆనందానికి గురిచేసింది. ఈ రెండు రోడ్లను ఫోర్‌లేన్‌గా మార్చే కార్యచరణను కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో మరిపెడ ప్రాంత ప్రజలు మురిసిపోతున్నారు. డబుల్ రోడ్లతోనే భూముల ధరలకు డిమాండ్ రావడంతో ఇప్పటికీ సంతోషంగా ఉన్న ఈ ప్రాంత రైతులు తమ భూములు, ప్లాట్లకు మరింత డిమాండ్ వస్తుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఫోర్‌లేన్ రోడ్ల కోసం 2021లోనే సర్వే జరిగింది. మరిపెడ మునిసిపల్ కేంద్రంలో ఫ్లై ఓవర్ నిర్మిస్తారని లేక బైపాస్ లైన్ వేస్తారని చర్చ సాగుతుంది. ఏదీ ఏమైనా మరిపెడ ప్రాంత ప్రజలకు మహర్దశ పట్టనున్నది.

శాశ్వత ఆధార్ కేంద్రాలేవి ?

- ఐదు మండలాల్లో కానరాని సెంటర్లు
- అప్‌డేట్‌కు తప్పని తిప్పలు
- అవస్థలు పడుతున్న ప్రజలు

మహదేవపూర్ రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : కాటారం సబ్‌డివిజన్ పరిధిలో శాశ్వత ఆధార్ నమోదు కేంద్రాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐదు మండలాల్లో ఎక్కడ వాటి జాడే కనపడటం లేదు. కనీసం అప్‌డేట్ సెంటర్లు కూడా అందుబాటు లేవు. గతంలో ఉన్న శాశ్వత నమోదు కేంద్రాలు తెరుచుకోవడం లేదు. దీంతో మహదేవపూర్, కాటారం, పలిమెల, మహముత్తారం, పలిమెల మండలాల ప్రజలు అప్‌డేట్ కోసం నానా పాట్లు పడుతున్నారు. ఆధార్‌లో ఫోన్ నెంబర్, ఫొటో, బయోమెట్రిక్, అడ్రస్ అప్‌డేట్లతో పాటు ప్రతి పదేండ్లకు ఒకసారి చేసుకునే డాక్యుమెంట్ అప్‌డేట్ కూడా చేసుకోలేని పరిస్థితి నెలకొంది.

ఉన్నవాటిని తీసేయ్యక.. కొత్తవాటికి అనుమతించక..

గతంలో ఐదు మండలాల పరిధిలో ప్రతి మండలంలోని ఒక మీ -సేవ కేంద్రంలో శాశ్వత ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆ కేంద్రాల్లోనే కొత్త ఆధార్ కార్డుల నమోదుతో పాటు ఉన్న ఆధార్ కార్డులు అప్‌డేట్ చేసేందుకు అవకాశం ఉండేది. కాని కొత్త ఆధార్ నమోదు, ఇదివరకే ఉన్న ఆధార్‌కార్డుల అప్‌డేట్లలో అవకతవకలు జరుగుతున్నాయన్న ఆరోపణలతో ఆ కేంద్రాలను తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్వహించేలా ఆదేశాలు వచ్చాయి. దీంతో కొన్నేండ్లుగా తహసీల్దార్ కార్యాలయాల్లోనే ఈ కేంద్రాలు కొనసాగుతున్నాయి. సుమారు సంవత్సరం కాలం అవి కూడా పని చేయడం లేదు. కొన్ని కేంద్రాల్లో ఆధార్ ఆపరేటర్లు చేసిన తప్పులకు జరిమానా విధించడంతో పాటు సస్పెండ్ చేశారు. మరికొన్ని కేంద్రాల్లో భారీగా జరిమానాలు విధించడంతో ఆపరేటర్లు సైతం నిర్వహించేందుకు ముందుకు రావడం లేదు. అప్పటి నుంచి ఉన్న కేంద్రాలను పునరుద్ధరించకపోగా కొత్త కేంద్రాలను కేటాయించలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సమయానికి అప్‌డేట్ చేయక బ్లాక్

మండలానికి కనీసం ఒక్క ఆధార్ కేంద్రం లేకపోవడంతో అప్‌డేట్ ప్రక్రియలో సమస్య నెలకొంది. పిల్లలకు బాల ఆధార్ నుంచి మెయిన్ ఆధార్‌కు అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. ఐదు సంవత్సరాలలోపు ఆధార్ పొందిన పిల్లలు ఐదేళ్లకు ఒకసారి పదేళ్లకొకసారి, మళ్లీ పదిహేను ఏళ్లకొకసారి మ్యాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. ఈ అప్‌డేట్ ఉచితమే అయినా కేంద్రాలు అందుబాటులో లేక అవి జరగడం లేదు. బయోమెట్రిక్ వచ్చి ఏడాది దాటినా అప్‌డేట్ చేయకపోతుండడంతో ఆధార్ కార్డులు బ్లాక్ అవుతున్నాయి. మళ్లీ వాటిని పునరుద్ధరించాలంటే హైదరాబాద్‌లో ఉన్న యూఐడీఏఐ ప్రాంతీయ కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుంది. అయితే జిల్లా కేంద్రంలో ఉన్న ఆధార్ కేంద్రానికి వెళ్లాలంటేనే ఇబ్బందులు పడాల్సి వస్తోందని.. ఏకంగా హైదరాబాద్ అంటే తమ పరిస్థితి ఏంటని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడిచిన సంవత్సరంలో ఐదు మండలాల్లో సుమారు వందకు పైగా ఆధార్ కార్డులు బ్లాక్ అయినట్లు తెలిసింది. ఆధార్ కార్డులు ఆగిపోతే రేషన్ బియ్యంతో పాటు బ్యాంకింగ్, రైతు భరోసా, పెన్షన్ వంటి మరెన్నో ప్రభుత్వ పథకాలను కోల్పోయే అవకాశం ఉంది. కొత్త కేంద్రాలను ఏర్పాటు చేయడమో లేదా ఉన్న కేంద్రాలను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.



ఏ అప్‌డేట్‌కైనా జిల్లా కేంద్రానికే పరుగు

కొత్త ఆధార్ కార్డుతో పాటు ఇదివరకే ఉన్న ఆధార్ కార్డులో అప్‌డేట్ చేసుకోవాలన్న జిల్లా కేంద్రానికే పరుగులు పెట్టాల్సి వస్తోంది. ఆధార్‌లో ఫోన్ నెంబర్‌తో పాటు మెయిల్ ఐడీ, చిరునామా, కేరాఫ్, పుట్టిన తేదీ, జెండర్, పేరును అప్‌డేట్ చేసేందుకు అవకాశం ఉంది. ఇందులో ప్రధానంగా ఫోన్ నెంబర్, పుట్టిన తేదీ, చిరునామాలో మార్పు కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రంలోనూ పరిమిత సంఖ్యలోనే ఆధార్ సెంటర్లు ఉండటంతో తీవ్ర రద్దీ ఉంటుంది. ఈ నేపథ్యంలో నిర్వాహకులు టోకెన్ పద్ధతిలో ఆధార్ అప్‌డేట్లు చేస్తున్నారు. పలిమెల వంటి మారుమూల ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలకు టోకెన్ దొరకక వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక్క అప్‌డేట్ కోసం మూడు నాలుగు సార్లు వెళ్లాల్లి రావడంపై వాపోతున్నారు.

క్రేజీ.. జియాలజీ

పీజీ కోర్సు పూర్తి చేసినవారికి ఉజ్వల భవిష్యత్

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో విస్తృత ఉద్యోగావకాశాలు
- కేయూలో అడ్మిషన్లకు పెరుగుతున్న డిమాండ్
- ఈ యేడాది నుంచి ప్రవేశాలకు అర్హతల సడలింపు

కేయూ క్యాంపస్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సైన్స్ విభాగంలో విభిన్నమైన కోర్సు భూగర్భ (జియాలజీ)శాస్త్రం. దీనికి ఏటా డిమాండ్ పెరుగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో విరివిగా ఉద్యోగ అవకాశాలు లభిస్తుండటంతో యువత ఎంఎస్సీ జియాలజీ కోర్సు పట్ల ఆసక్తి చూపుతున్నారు. కేయూలో 1989లో 12 సీట్లతో ఈ కోర్సును ప్రారంభించారు. విద్యార్థుల డిమాండ్ దృష్ట్యా ప్రస్తుతం 40 సీట్లకు పెంచారు. యేటా ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలు కేయూ జియాలజీ విద్యార్థులకు ప్రాంగణ నియామకాలు చేపడుతున్నాయి. విదేశీ సంస్థలు సంస్థలు సైతం జియాలజీ విద్యార్థులను భారీ ప్యాకేజీలతో ఎగరేసుకుపోతున్నాయి.

జియాలజీ విభిన్నం..

సైన్స్ కోర్సులన్నింటిలో జియాలజీ కోర్సు విభిన్నం. భూమి పుట్టుక నుంచి ఉపరితలంపై నిత్యం చోటు చేసుకునే అంశాలను ఈ కోర్సు అధ్యయనం చేస్తుంది. భూమార్పులకు కారణాలను శాస్త్రీయంగా విశ్లేషిస్తుంది. భూమిలో ఉండే పెట్రోల్, గ్యాస్‌తో పాటు బంగారం, రత్నాలు, వజ్రాలు, బొగ్గు ఖనిజాలను పసిగడుతుంది. అంతేగాకుండా సునామీ, భూకంపాలు, అగ్ని పర్వతాల పేలుడు లాంటి ప్రకృతి వైపరీత్యాలను అధ్యయనం చేస్తుంది. సాఫ్ట్‌వేర్ రంగంలోనూ జియాలజీ విభాగాలు తోడ్పడుతున్నాయి.

జియాలజీ చదివితే ఉద్యోగం గ్యారంటీ..

రోజురోజుకూ జియాలజీ కోర్సుకు విస్తృతి పెరుగుతోంది. జియాలజీ కోర్సులు చదివితే ఉద్యోగం గ్యారంటీ అని చెప్పవచ్చు. సబ్జెక్టులో అత్యుత్తమ ప్రతిభ కల్గిన వారికి ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ రంగాల్లో ఉద్యోగాలు లభిస్తాయి. ఈ దఫా నుంచి ఏదైనా సైన్స్ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించిన వారందరూ ఎంఎస్సీ జియాలజీ కోర్సులో అడ్మిషన్లు పొందవచ్చు. కేయూ క్యాంపస్‌లో 40 సీట్లున్నాయి. క్యాంపస్‌లో హాస్టల్ వసతి ఉంది. అడ్మిషన్లపై విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే నేరుగా కేయూ జియాలజీ విభాగాన్ని సంప్రదించవచ్చు.

- ప్రొఫెసర్ రాగి మల్లికార్జున్‌రెడ్డి
విభాగాధిపతి, జియాలజీ





కేయూలో ఎంఎస్సీ జియాలజీ విభాగం

కేయూ జియాలజీ విభాగం ప్రత్యేకతలు

కేయూ క్యాంపస్‌లో జియాలజీ విభాగం ఉంది. వివిధ ఖనిజాలు, శిలల సముదాయాలతో కూడిన మ్యూజియం నెలకొల్పారు. జీఐఎస్, రిమోట్ సెన్సింగ్ ల్యాబ్, భూగర్భ జలాన్వేషణకు అవసరమయ్యే సాంకేతిక పరిజ్ఞానం అందిస్తోంది. జియాలజికల్ సర్వే ఎక్విప్‌మెంట్, అత్యాధునిక రీసెర్చ్ మైక్రోస్కోప్ ల్యాబ్, పెట్రాజికల్, జియో కెమికల్ మోడలింగ్, సాఫ్ట్‌వేర్, భూగర్భ జల నాణ్యత పరీక్షల ల్యాబ్, ఈ-క్లాస్‌రూమ్ బోధన, లైబ్రరీని ఏర్పాటు చేశారు. యేటా జియాలజీ విభాగం విద్యార్థులకు ఫీల్డ్ వర్క్స్, గనుల చమురు క్షేత్రాల సందర్శన, ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్స్, క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌తో పాటు అత్యుత్తమ అర్హతలు కల్గిన ప్రొఫెసర్లతో బోధన అందిస్తున్నారు.

కోర్సు ప్రవేశానికి అర్హతలివే..

ఎంఎస్సీ జియాలజీ కోర్సులో అడ్మిషన్లకు ఏదైనా సైన్స్ డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్సిటీల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు నిర్వహించే సీపీజీఈటీ-2025 ర్యాంక్ ఆధారంగా అడ్మిషన్లు కల్పిస్తారు. సీపీజీఈటీ-2025కి రూ.500 అపరాధ రుసుంతో ఈ నెల 24వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు https://cpget.tgche.ac.in/ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

ఉద్యోగ అవకాశాలు

జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు, నేషనల్ జియోఫికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, ఆయిల్ అండ్ న్యాచురల్ గ్యాస్ కార్పొరేషన్, ఆయిల్ ఇండియా లిమిటెడ్, అటామిక్ మినరల్ డివిజన్, మినరల్ ఎక్స్‌రేషన్ కార్పొరేషన్, నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, కోల్ ఇండియా లిమిటెడ్, నేషనల్ లిగ్నైట్ కార్పొరేషన్ లిమిటెడ్, నేషనల్ హైడ్రో ఎలక్ట్రికల్ పవర్ కార్పొరేషన్‌లో విస్తృత ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి.

రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లోనూ ఉద్యోగాలు

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ, రాష్ట్ర భూగర్భ జల శాఖ, డిస్ట్రిక్టు రూరల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ, తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్‌లోనూ ఉద్యోగ అవకాశాలున్నాయి. వీటితో పాటు ప్రైవేట్ సంస్థల్లోనూ ఉద్యోగాలు కల్పిస్తున్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో జీఐఎస్ అనలిస్ట్, మల్టీ నేషనల్ మైనింగ్ కంపెనీలు, పర్యావరణ వేత్తలు, భూగర్భజల అన్వేషణ కంపెనీలు, సిమెంట్ పరిశ్రమలు, జాతీయ ఖనిజ అన్వేషణ సంస్థల్లోనూ ఉద్యోగాలు కల్పిస్తున్నారు.

తుమ్మచెట్టుపై మర్రి మొక్క!



తుమ్మ చెట్టు కొమ్మపై మర్రి మొక్క పెరగడం ఆసక్తికరంగా మారింది. కేసముద్రం మండలం ఉప్పరపల్లి చెరువు కట్టపైనున్న ఓ తుమ్మ చెట్టుపై మర్రి మొక్క పెరుగుతోంది. పక్షులు మర్రిపండ్లను తీసుకువచ్చి తుమ్మచెట్టుపై తినడంవల్ల గింజలు పడి మర్రిమొక్క ఉద్భవించిందని పలువురు చెబుతున్నారు. అయితే పూర్తిగా చెట్టుపైనే ఆధారపడుతూ మర్రిచెట్టు పెరగడమే ఇక్కడ వింతగా కనిపిస్తోంది. మర్రిచెట్టు పెరిగేందుకు అవసరమైన పోషకాలన్నీ తుమ్మచెట్టు నుంచే అందుతుండడం గమనార్హం. స్వయం పోషకాలుగా పిలవబడే మొక్క భిన్నంగా తన ఎదుగుదలకు మరో చెట్టుపై ఆధారపడి పరాన్నజీవిగా వ్యవహరించడం గమనార్హం.

- కేసముద్రం (ఆంధ్రజ్యోతి)

తల్లడిల్లిన తల్లి కోడి



ఏ జీవి అయినా తన బిడ్డకు ఏమైనా జరిగితే తట్టుకోలేదు. ఆ బిడ్డ చనిపోయిందని తెలియక పిల్లను లేపడానికి తల్లి ప్రయత్నం చేస్తుంటుంది. ఇదే తరహాలో ఇనుగుర్తి మండల కేంద్రంలోని బోయినివాడ వీధిలో మంగళవారం ఉదయం ఓ వీధిలో కోడిపిల్ల చనిపోగా దాన్ని లేపేందుకు తల్లికోడి ప్రయత్నించి, దాదాపు మూడు గంటలపాటు అక్కడే తిరుగుతుండడం పలువురిని చలింపజేసింది. ఏ జాతి అయినా పిల్లల విషయంలో తల్లి ప్రేమ ఒకటేనని ఈ దృశ్యం నిరూపిస్తోంది.

- ఇనుగుర్తి (ఆంధ్రజ్యోతి)

మహిళలకు చదువుచెపుతున్న వాలంటరీ టీచర(పాతచిత్రం)



'ఉల్లాస్'ంగా.. ఉద్యోగావకాశం

- అతివల అక్షరాస్యతకు సదావకాశం
- మహిళా సంఘాల్లోని సభ్యులపై ప్రత్యేక దృష్టి
- చదువుకున్న వారిని టీచర్లుగా ఎంపిక
- ఈ ఏడాది నుంచి రాష్ట్రంలో అమలు

హనుమకొండ కలెక్టరేట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే నవభారత్ సాక్షరత కార్యక్రమం ఈ యేడు నుంచి రాష్ట్రంలో అమలు చేసి మహిళా అక్షరాస్యతపై దృష్టి సారించనున్నారు. డ్వాక్రా గ్రూపుల్లో చదువుకోని మహిళలను గుర్తించి వారు చదువుకునే విధంగా ప్రో త్సహించేందుకు ఈ ఉల్లాస్ కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టనున్నాయి. వీరు చదువుకునేందుకు వలంటీర్లనువిని యోగిస్తారు. గ్రామీణపేదరిక నిర్మూ లన సంస్థ(సెర్ప్) సహకారంతో వీవోఏలు, స్వయం సహాయక బృందాలు, మహిళా సంఘాలు ఉన్నాయి. ఈ బృందాల్లో చదువుకున్న మహిళలను గుర్తించి వలంటీరు టీచర్లుగా ఎంపిక చేస్తారు. ఒక్కొక్కరు 10మంది అక్షరాస్యులుగా చేయాల్సి ఉంటుంది. ఆసక్తి ఉన్న విశ్రాంత ఉపాధ్యాయులు, విద్యార్థులు వలంటీర్లుగా చేయవచ్చు. అనంతరం తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం (టాస్)నుంచి 10వ తరగతి చదువుకునేలా ప్రోత్సహిస్తారు. గతంలో సాక్షారభారత్ కార్యక్రమం 2017తో ముగిసింది. అప్పటినుంచి ఇప్పటివరకు ప్రభుత్వాలు అక్షరాస్యతను పెంచే కార్యక్రమాలు చేయలేదు.

నిర్వహణ కమిటీ

గ్రామస్థాయిలో పథకం వేగవంతంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ 16ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. అందులో డీఆర్‌డీఓతోపాటు విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తారు. మండలస్థాయిలో ఎంపీడీఓ, ఎంఈఓ, ఐకేపీ ఏపీఎం, గ్రామస్థాయిలో ఉపాధ్యాయుడు, పీఓ ఏఅధ్యక్షులు, కార్యదర్శి బాధ్యతలు చూసుకుంటారు.

ఊతం ఇవ్వనున్న ఈ-డిజిటల్

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన ఉల్లాస్(అండర్ స్టాండింగ్ లైఫ్ లాంగ్ లర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) యాప్ ఎట్టకేలకు ప్రజల ముందుకు వచ్చింది. అక్షరాస్యత కార్యక్రమాలకు ఈ-డిజిటల్ ఊతం ఇవ్వనుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో డిజిటల్ ఇండియా చొరవలో భాగంగా ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. ఇది పెనుమార్పులకు నాంది పలకనుంది. 2027 వరకు ఈ ఉల్లాస్ కార్యక్రమం కొనసాగనుంది.

16 అధ్యాయాల పుస్తకాలు ఉంటాయి

- తెలుగులో చదవడం, రాయడం.
- అంకెలు గుర్తించడం, కూడికలు, తీసివేతలు.
- ఆదాయం పెంచుకునేలా సూచనలు.
- పోషకాహార లోపం, అనారోగ్యాలు.
- అమ్మకు బ్యాంకు ఖాతా.
- ఇరుగు పొరుగుతో మాటామంతీ
- నైపుణ్యాల అభివృద్ధి అంశాలు.
- నిత్యజీవితంలో అవసరమయ్యే ఇతరాలు ఉంటాయి.

ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తాం..



జిల్లాలో నిర్దేశించుకున్న లక్ష్యం చేరేలా కార్యచారణ రూపొందిస్తాం. దానికి అనుగుణంగా నిరక్షరాస్యులకు చదువు చెప్పేలా ప్రణాళిక చేస్తాం. విద్యాశాఖ డీఆర్‌డీఓ సంయుక్తంగా పనిచేసి లక్ష్యాన్ని చేరుకుని జిల్లాలో మహిళల అక్షరాస్యత పెంచేందుకు కృషి చేస్తాం.

- మేన శ్రీను, హనుమకొండ జిల్లా డీఆర్‌డీఓ

సీఎం ఇన్‌స్టాలో 'కాటారం వరినాట్లు'




రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇన్‌స్టాగ్రామ్ అఫీషియల్ పేజీలో కాటారం మండలంలో చేపడుతున్న వానాకాలం వరినాట్లు వార్త పెట్టు కోవడం విశేషం. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'వానాకాలం వరి నాట్లు షురూ' శీర్షికన ప్రచురితమైన కథనం ఇన్‌స్టాగ్రామ్‌లో 'రేవంత్ అఫీషియల్' పేరిట ఉన్న గ్రూపులో చోటు చేసుకుంది. రేవంత్ అఫీషియల్ గ్రూపును ఫాలో అవుతున్న పలువురు వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నాట్లు వేస్తున్న పరిస్థితులను 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం చేయడంతో ఇలా సీఎం ఇన్‌స్టాగ్రామ్ పేజీలో పెట్టుకున్నట్లు అభిప్రాయపడుతున్నారు.

- కాటారం (ఆంధ్రజ్యోతి)

'శ్రీరామా.. నీ దయ చూపు'

- 77 రామదాసు సంకీర్తనలు ఆంగ్లానువాదం
- పుస్తకంగా ప్రచురించిన ఆథర్స్ ప్రెస్
- ప్రొఫెసర్ రాజగోపాలాచారి రచనాశైలి




ఆచార్య రాజగోపాలాచారి రామదాసు సంకీర్తనల అంగ్లానువాదం షొయర్ యువర్ మెర్సీ, ఓ శ్రీరామా! పుస్తకం

హనుమకొండ, జులై 22 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ భక్తుడు రామదాసు (కంచెర్ల గోపన్న) రచించిన 77 సంకీర్తనలను కాకతీయ విశ్వవిద్యాలయం ఆంగ్లశాఖ విశ్రాంతాచార్యుడు మాడభూషణం రాజగోపాలాచారి ఇటీవల అంగ్లంలోకి అనువదించారు. షవర్ యువర్ మెర్సీ ఓ శ్రీ రామా! అనే శీర్షికతో ఈ పుస్తకాన్ని న్యూఢిల్లీలోని ఆథర్స్ ప్రెస్ పుస్తకంగా ప్రచురించింది. రాజగోపాలాచారి 208 అన్నమయ్య కీర్తనల ఆంగ్లానువాదాన్ని కూడా ఈ ప్రెస్ గతంలో ముద్రించింది. పురాతన సాహిత్యానువాదంలో భాషాపరంగా ఉన్న ఇబ్బందులను సమర్థంగా ఎదుర్కొంటూ, మూలరచన దెబ్బతినకుండా రామదాసు కీర్తనలను అందంగా అనువదించారు. భక్తిసాహిత్యం పట్ల ఆచార్య రాజగోపాచారి మొక్కవోని నిబద్ధతను ఈ గ్రంథం తెలుపుతుంది. ఆచార్య ఈ పుస్తకంలో శ్రీ రామదాసు 77సంకీర్తనలను అంగ్ల అనువాదంతో పాటు తెలుగు మూలాన్ని కూడా సమకూర్చారు. వీటితో పాటు ప్రతీ సంకీర్తనకు కఠిన పదాల అర్థాలు, సుబోధకమైన ఆంగ్ల వ్యాఖ్యానం ఇవ్వడం ఇందులో విశేషం. ఆంగ్లం రాని తెలుగు పాఠకులకు కూడా ఇదొక రామదాసు సంకీర్తనల సంకలనంగా చదువుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. గ్లోసరిలో కఠిన పదాలకు ఆంగ్లంతో పాటు తెలుగులో కూడా అర్థాలు ఇవ్వడం వల్ల సంకీర్తనలను అర్థం చేసుకోవడం సులభమైంది. రచయిత ఈ సంకీర్తనలను నాలుగు విభాగాలుగా విభజించడం ఇందులో ప్రత్యేకత. గ్లోరీ ఆఫ్ లార్డ్ శ్రీ రామా అనే మొదటి విభాగంలో మొత్తం 23 సంకీర్తనలు చేర్చారు. ఈ విభాగంలోనే 11 సంకీర్తనలను నామ సంకీర్తన అన్న ఉపవిభాగంలో చేర్చారు. మూడో విభాగపు 18 కీర్తనలలో శ్రీమద్రామానుజుల విశిష్టాద్వైత సిద్ధాంత ప్రభావం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. 'ఎన్‌కౌంటర్ విత్ తానీషా' అన్న చివరి విభాగంలో 'వినరయ్య తానీషాగారు మా మనవి..' అంటూ తన మనవిని రామదాసు విన్నవించిన తీరును ఆంగ్లంలో ఆకట్టుకునే రీతిలో అనువదించారు.

పలు ఆంగ్లానువాదాలు

ఆచార్య రాజగోపాలాచార్య ఇంతకుముందు పలు ఆంగ్లానువాదాలు చేశారు. అన్నమయ్య కీర్తనలను 'హై ఇన్‌ది స్కై అట్ విష్ణుపాద! అన్నమాచార్య సంకీర్తనాస్' పేరుతో చేసిన ఆంగ్లానువాదం ఇందులో ఒకటి. తిరుమల తిరుపతి వైభవంపై 'ఎటర్నల్ గ్లోరీ ఆఫ్ తిరుమల తిరుపతి షైరెన్ (టీటీడీ-2024)' పేరుతో పుస్తకాన్ని ఆంగ్లంలో రచించారు. తెలంగాణ సాయుధ పోరాటంపై 'తెలంగాణ ఆర్మ్‌డ్ స్ట్రగుల్ - 1948' పేరుతో ఆంగ్లంలో రాసిన మరో పుస్తకం బహుళ ప్రాచుర్యం పొందింది. డైవర్సిటీ ఇన్ ఇండియన్ లిటరేచర్ ఇన్ ఇంగ్లీష్ రీసెంట్ రిఫ్లెక్షన్స్ (2019), భక్తి మూమెంట్ అండ్ లిటరేచర్ (2016), పోస్ట్ కలోనియల్ ఇండియన్ ఇంగ్లీష్ ఫిక్షన్: డిసెంటరింగ్ ది నేషన్ (2016), మల్టీకల్చరలిజం ఇన్ ఇండియన్ ట్రెడిషన్ అండ్ లిటరేచర్ (2016) వంటి పలు పుస్తకాలు ఆచార్య సంపాదకత్వంలో వెలువడ్డాయి. ఆచార్య రాజగోపాలాచార్య 2021 నుంచి 2023 వరకు సప్తగిరి (ఇంగ్లీష్) సంపాదక మండలిలో సభ్యుడిగా కూడా ఉన్నారు. శ్రీ వెంకటేశ్వరుడి మహిమలు, తిరుమల వైభవంపై ఇందులో అనేక వ్యాసాలు రాశారు.

సంకీర్తనా సాహిత్యాన్ని విశ్వవ్యాప్తం చేయాలనే..



భక్తిసాహిత్యంలో తనదైనశైలిలో సంకీర్తనలను రచించి విశిష్ట స్థానాన్ని పొందిన కంచెర్ల గోపన్న (1620-1688) భద్రాచల దేవాలయం నిర్మాణం చేసి శ్రీ రామదాసుగా ప్రసిద్ధి చెందాడు. తెలుగు రాష్ట్రాల్లోనే కాక పొరుగు రాష్ట్రాల్లో కూడా ఆయన కీర్తనలు సంకీర్తనా గోష్ఠులలో, భజనలలో ముఖ్య భూమికను సంతరించుకున్నాయి. 'దాశరథీ కరుణాపయోనిధీ!' అనే మకుటంతో ఆయన రచించిన దాశరథి శతకంలో కనీసం ఒక్క పద్యం రాని తెలుగువాడు ఉండడంటే అతిశయోక్తి కాదు. 'పలుకే బంగారమాయెనా కోదండపాణి..' వంటి కీర్తనలు ప్రజలలో బహుళ ప్రాచుర్యం పొందాయి. సంకీర్తనా సాహిత్య ఔన్నత్యాన్ని తెలుగు రాష్ట్రాల పరిధిదాటి ఇతర రాష్ట్రాల, దేశాల పాఠకులకు పరిచయం చేసే బృహత్తర ప్రయత్నంలో భాగంగా రామదాసు కీర్తనలను ఆంగ్లానువాదం చేశాను.

- ఆచార్య రాజగోపాలాచారి, హనుమకొండ

మేడారంలో కేశఖండనకు రుసుము పెంపు



తాడ్వాయి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క-సారలమ్మ దేవస్థానంలో భక్తుల కేశఖండనకు రుసుము పెంచినట్టు దేవస్థానం కార్యనిర్వహణ అధికారి వీరస్వామి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో రూ. 10 ఉండగా, ఇప్పుడు రుసుము రూ. 50గా నిర్ణయించినట్టు తెలిపారు. దీనిపై అభ్యంతరాలేమైనా ఉంటే 15 రోజుల్లోగా తమకు తెలపాలని పేర్కొన్నారు.

ఆరంభశూరత్వమే...

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు ● ఏర్పాటు చేసినట్టే చేసి నిర్వహణ మరచిన అధికారులు

మంగపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆట స్థలాలకు ఆదరణ కరువైంది. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా మైదానాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. యువతను ప్రోత్సాహిస్తూ వారి నైపుణ్యాలను వెలికి తీసి క్రీడాల్లో రాణించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను క్రీడా మైదానాలుగా ఏర్పాటు చేసింది. అవి అలంకారప్రాయాలుగా మిగిలిపోయాయి. ప్రతి గ్రామ పంచాయతీతో పాటు శివారు పల్లెల్లో కచ్చితంగా క్రీడామైదానం ఉండాలన్న ఉద్దేశంతో ఒక్కోదానికి రూ. 50 వేల నుంచి రూ. 2 లక్షల వరకు గత ప్రభుత్వం వెచ్చించింది. ఆ తర్వాత అవి నిరుపయోగంగా మారాయి. ఆలనా పాలన లేక పిచ్చి మొక్కలతో నిండిపోతున్నాయి.

సౌకర్యాలు లేక..

మండల వ్యాప్తంగా గత ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలు ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కొన్ని కనీస సౌకర్యాలు లేక, శిక్షణా ఇచ్చే వారు లేక మరుగున పడ్డాయి. కొన్ని క్రీడా మైదానాల్లో రెండు పోల్స్, ఎక్సర్‌సైజ్ బార్‌లను ఏర్పాటు చేసి గాలికి వదిలేశారు. ఆ మైదానాలల్లో ఆటలు ఆడే పరిస్థితి లేదు. మండలంలోని 25 గ్రామ పంచాయతీలు, 24 రెవెన్యూ గ్రామాలు ఉండగా, మొత్తం 49 క్రీడా మైదానాల్లో పిచ్చి మొక్కలతో అధ్వానంగా మారాయి.

హడావిడిగా ప్రారంభించి...

క్రీడా ప్రాంగణాల ఏర్పాటు పేరుతో కొన్ని చోట్ల భూమిని చదును చేస్తున్నామంటూ డోజర్లతో నాలుగుసార్లు అటుఇటు తిప్పి పెద్దపెద్ద బోర్డులు మాత్రమే అధికారులు తగిలించారనే విమర్శలు ఉన్నాయి. కానీ, అవసరమైన సామగ్రి కల్పించలేదని తెలుస్తోంది. క్రీడా ప్రాంగణాల చుట్టూ వేప, గుల్మార్, కానుగ, చింతతో పాటు పలు రకాల నీడలను మొక్కలు నాటాలనే నిబంధన ఉన్నా, దాన్ని తుంగలో తొక్కి వాటిని ఎక్కడా నాటిన దాఖాలాలు లేవు. కొన్నిచోట్ల నాటినా సంరక్షణ లేక పూర్తిగా అవి ఎండిపోయాయి. కొన్నింటిని పశువులు మేయడం వల్ల గ్రౌండ్లన్నీ కళ తప్పాయి. కొన్ని మైదానాల్లో క్రీడాకారులు అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితి నెలకొంది. క్రీడా మైదానాలు ఎక్కడెక్కడ ఉన్నాయో కూడా చాలా మందికి తెలియదనే వాదన ఉంది. దీంతో లక్షల రూపాయలతో నిర్మించిన క్రీడా మైదానాలు నిరుపయోగంగా మారాయి. రాజుల సొమ్ము రాళ్లపాలు అన్న చందాన నిధులన్నీ వృథా అయ్యాయనే అభిప్రాయం సర్వత్రా వినిపిస్తోంది.



కమలాపురంలో నిరుపయోగంగా క్రీడా మైదానం

ప్రచారం కోసమే ఆర్భాటం



గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రచార ఆర్బాటం కోసమే తెలంగాణ క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేసింది. యువత క్రీడాల్లో రాణిం చేందుకు మైదానాలల్లో పరికరాలు సమకూర్చలేదు. ఇప్పటికైనా ఉన్నతాధి కారులు స్పందించి ఈ మైదానాలను వాడకంలోకి తీసుకురావాలి.

- జబ్బ సమ్మయ్య, కోమటిపల్లి మాజీ సర్పంచ్

సద్వినియోగం చేసుకోవాలి



క్రీడాప్రాంగణాలను సద్వినియోగం చేసుకో వాలి. ప్రభుత్వం నిర్మించిన క్రీడాప్రాంగణాలను యువకులు ఉపయోగించుకోలేకపోతున్నారు. అందులో పిచ్చి మొక్క లు పెరిగాయి. త్వరలో గ్రామపంచాయతీ సిబ్బందితో వాటిని తొలగించి శుభ్రం చేసి వాడకంలోకి తీసుకొస్తాం

- బి.భద్రు, మంగపేట ఎంపీడీవో

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం



సమావేశంలో మాట్లాడుతున్న సిరికొండ బలరాం

తాడ్వాయి, జూలై 22(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బూత్ స్థాయిలో ప్రతి కార్యకర్తా పనిచేయాలని అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ బీజేపీ గెలుపు కోసం పాటుపడాలని అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు తాళ్లపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండల ఇన్‌చార్జి పళ్ల బుచ్చయ్య, స్థానిక సంస్థల ఎన్నికల జిల్లా కన్వీనర్ రాజునాయక్, రాష్ట్ర ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గుగులోత్ స్వరూప, జిల్లా ప్రధాన కార్యదర్శి భర్తపురం నరేష్, నాయకులు కృష్ణారావు, రాంబాబు, ఓంబ్రా, సలేందర్, హన్మంతరెడ్డి, సురేందర్, శ్రీకాంత్, కుమార్, నవీన్, నాగేష్, చిన్న, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రామప్ప ఆలయంలో బహిరంగ వేలం

వెంకటాపూర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామప్ప రామలింగేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో ఏడాదిపాటు కొబ్బరికాయలు, పూజాసామగ్రి అమ్ముకునేందుకు మంగళవారం బహిరంగ వేలంపాట నిర్వహించారు. దీంతో ఆలయానికి రూ.6లక్షల46వేల ఆదాయం సమకూరింది. ఈసందర్భంగా దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరకాల డివిజన్ పరిశీలకురాలు ఎస్.కవిత మాట్లాడుతూ వేలంపాట ద్వారా గత సంవత్సరంకంటే ఈఏడాది రూ.లక్షా26వేల ఎక్కువ ఆదాయం వచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బిల్ల శ్రీనివాస్, రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ సుధాకర్, అర్చకులు కోమాళ్లపల్లి హరీశ్‌శర్మ, ఉమాశంకర్, సిబ్బంది, పాటదారులు పాల్గొన్నారు.

వెంకటాపురం సీఐగా రమేష్



వెంకటాపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వెంకటాపురం సీఐగా ముత్యం రమేష్‌ను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రస్తుత సీఐ బండారి కుమార్ హైదరాబాద్ ఏడీజీ కార్యాలయానికి అటాచ్ అయ్యారు. సీఐ ముత్యం రమేష్ కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల నుంచి వెంకటాపురానికి బదిలీపై రానున్నారు.

పస్రా సీఐగా దయాకర్

గోవిందరావుపేట (ఆంధ్రజ్యోతి): పస్రా సీఐగా పి.దయాకర్‌ను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రస్తుత సీఐ జి.రవీందర్ వీఆర్‌కు వెళ్లగా ఆయన స్థానంలో వీఆర్‌లో ఉన్న దయాకర్ బదిలీపై రానున్నారు.

నేరాల నియంత్రణపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పోలీసులు

తాడ్వాయి, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలో నేరాల నియంత్రణపై ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రైనీ ఎస్సై మధు సిబ్బందితో కలిసి గ్రామాల్లో ప్రజలకు నేరాలు, శిక్షల పై అవగాహన కల్పించారు. గ్రామాల్లో నేరాలకు తావులేకుండా గ్రామస్థులు ఐక్యంగా ఉండాలన్నారు. అదేవిధంగా యువతకు వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు.

సీపీఎం సమావేశాన్ని విజయవంతం చేయండి

గోవిందరావుపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఈనెల 24న జరిగే సీపీఎం విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆపార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు తుమ్మల వెంకటరెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని పస్రా లో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీనియర్ కమ్యూనిస్టుపార్టీ నాయకుడు వీరపనేని రామదాసు పదో వర్ధంతి సందర్భంగా పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశం జరుగుతుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై భవిష్యత్‌లో నిర్వహించే పోరాటాలకు దిశానిర్దేశం చేయడం జరుగుతుందని అన్నారు. ఈసమావేశంలో నాయకులు పొదిళ్ల చిట్టిబాబు, తీగల ఆదిరెడ్డి, గొంది రాజేష్, సోమ మల్లారెడ్డి, అల్లం అశోక్, పల్లపు రాజు, గరుగు ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

నారు కొనలను తుంచి నాట్లు వేసుకోవాలి



నాటు వేయడాన్ని పరిశీలిస్తున్న ఏవో, ఏఈవో

కాటారం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ముదిరిన నారు కొనలు తుంచి నాట్లు వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పూర్ణిమ రైతులకు సూచించారు. మండలంలోని రేగులగూడెం వ్యవసాయ క్లస్టర్ పరిధి దేవరాంపల్లి శివారులో మంగళవారం ఏఈవో అస్మాతో కలిసి ఏవో పూర్ణిమ క్షేత్రస్థాయిలో పర్యటించారు. నాట్లు వేసే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. నారు కొనలపై కాండం తొలిచే పురుగుల గుడ్ల లార్వా అవశేషాలు ఉంటాయన్నారు. కొనలను ఓ అంగుళం మేర తుంచేస్తే ఈ సీజన్‌లో కాండం తొలుచే పురుగు ఆశించకుండా చూడొచ్చన్నారు. నాట్లు వేయడానికి ముందే ఆఖరి దుక్కిలో ఎరువులు వేసుకుంటే ప్రయోజనం కలుగుతుందన్నారు. పత్తి, వరి పంటల్లో నత్రజని ఎరువైన యూరియాను అధికంగా వాడితే పంటలకు తెగుళ్ళు, చీడపీడల బాధలను కొనితెచ్చుకోవడమేనని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు శంక రయ్య, బాపు, తిరుపతి, విక్రమ్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంఈవో

భూపాలపల్లిటౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జరిగాయి. భూపాలపల్లి పట్టణంలోని జడ్పీహెచ్ఎస్‌లో యాజమాన్య పాఠశాలల్లో ఎనిమిదో తరగతి విద్యార్థులకు నివాసయోగ్యమైన భూగోళ పరిరక్షణ అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం ఎంఈవో దేవానాయక్ మాట్లాడుతూ భూగోళం వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా లేకుండా పోతోందన్నారు. ఈ క్రమంలో నివాసయోగ్యానికి కూడా పనికిరాకుండా పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. భూమిని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. విరివిగా మొక్కలు నాటడమే కాకుండా పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలని కోరారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా లీడ్ గ్లోబల్ ఫౌండేషన్ సమన్వయకర్త కుసుమ కృష్ణమోహన్, తదిత రులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి బీఆర్ఎస్ నేతల చేయూత



మృతుడి కుటుంబానికి సాయం అందిస్తున్న నేతలు

చిట్యాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కనుకం తిరుపతి ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పార్టీ మండల, యూత్ నాయకులు మంగళవారం పరామర్శించారు. తిరుపతి చిత్రపటం వద్ద నివాళ్లు అర్పించారు. రూ. 26వేలతోపాటు 50 కిలోల బియ్యం బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేష్, ప్రధాన కార్యదర్శి రాజేందర్, టౌన్ అధ్యక్షుడు బుర్ర శ్రీదర్, యూత్ మండల అధ్యక్షుడు తౌటం నవీన్, సీనియర్ నాయకులు బైరం భద్రయ్య, పాండ్రాల వీరస్వామి ఉన్నారు.

నేడు కొత్తగూడలో మంత్రి సీతక్క పర్యటన

కొత్తగూడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క బుధవారం పర్యటించనున్నట్టు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య తెలిపారు. ఈసందర్భంగా సారయ్య మా ట్లాడుతూ కొత్తగూడ రైతువేదికలో లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డులను మంత్రి సీతక్క పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో సీతక్క పాల్గొనున్నట్టు పేర్కొన్నారు. మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

జిల్లా వ్యాప్తంగా పోలీసుల ముమ్మర తనిఖీలు

ములుగు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని స్టేషన్ల పరిధిలో పోలీసులు మంగళవారం ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. సంఘ విద్రోహక చర్యలు అరికట్టడంలో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘనలు జరగకుండా ఈ చర్యలు చేపట్టారు. ఈనెల 28 నుంచి ఆగస్టు 3 వరకు మావోయిస్టుల వారోత్సవాలు జర గనున్న నేపథ్యంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారని తెలు స్తోంది. ములుగు జిల్లా మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో ఏజెన్సీ ప్రాంతాల్లో ఏదైనా అవాంఛనీయ సంఘటనకు పాల్పడతారనే అనుమానంతో పోలీసులు ముందస్తు వాహన తనిఖీలు చేపట్టారు.



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ములుగు ఎస్సై వెంకటేశ్వరావు

కాంగ్రెస్ పాలనపై ప్రజల అసంతృప్తి

మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కృష్ణకాలనీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి వ్యాఖ్యానించారు. భూపాలపల్లిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలకు మంత్రులు వచ్చి వెళ్లేందుకు పరిమితం అవుతున్నారే తప్ప అభివృద్ధిపై మాత్రం దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. రైతులు చెప్పులు లైన్లో పెట్టి ఎరువుల కోసం ఎదురు చూసే పరిస్థితి మళ్లీ తె లంగాణలో ఎదురవుతోందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతు చేయకపోవడంతో కొన్ని వే ల క్యూసెక్కుల నీళ్లు సముద్రగర్భంలో కలిసి పోతున్నాయని మండిపడ్డారు. పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే ఉద్దేశంతో గత సీఎం కేసీఆర్ డబుల్ బెడ్ రూం ఇళ్లకు శ్రీకారం చుట్టి, లబ్ధిదారులను ఎంపిక కూడా చేశారని గుర్తు చేశారు. తాము ఎంపిక చేసిన వారందరినీ తొలగించి అనర్హులకు, డబ్బులు ఇచ్చే వారికి మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వం కట్టబెడుతోందని విమర్శించారు. లబ్ధిదారుల ఎంపిక అంతా దళారీ వ్యవస్థ చేతిలోనే ఉందని ఆరోపించారు. జర్నలిస్టులకు తమ ప్రభుత్వ హయాంలో ఇంటి స్థలాలను కేటా యించామని, వాటిని పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలన్నారు. విలేక రుల సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కళ్లెపు రఘుపతిరావు, సెగ్గం సిద్ధు, బడితెల సమ్మయ్య, నూనె రాజు, మాడ హరీశ్‌రెడ్డి, దార పూలమ్మ, బీబీచారి, మాదాసు శ్రీనివాస్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర

విద్యే వ్యాపారం.. చదువులతో చెలగాటం

(5వ పేజీ తరువాయి)

డిసిప్లే చేయాల్సి ఉంటుంది. జిల్లాలోని పలు పాఠశాలల యజమానులు ఈ నిబంధనలేవీ పాటించడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి.

అసౌకర్యాలు.. అవవస్థలు

జిల్లాలోని పలు ప్రైవేటు పాఠశాలలు వెంటిలేషన్ సక్రమంగా లేని ఇరుకైన తరగతి గదుల్లో విద్యాబోధనలు సాగుతున్నాయని తెలుస్తోంది. చాలా వరకు పాఠశాలల్లో డిజిటల్ క్లాసులు అందుబాటులో లేవని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు పాఠశాలల్లో బల్లలు సక్రమంగా లేవని, బ్లాక్ బోర్డులనే ఇంకా వినియోగిస్తున్నారని అంటున్నారు. కొన్ని పాఠశాలలకు ప్రహరీ లేకపోవడంతో పందులు, కుక్కలు, మూగ జీవాలు వస్తున్నాయని చెబుతున్నారు. అలాగే కిటికీలకు తలుపులు, గ్రిల్స్ సక్రమంగా లేవని, బల్లులు, తొండలు క్లాస్ రూముల్లోకి వస్తున్నాయని విద్యార్థులు అంటున్నారు. కిటికీలకు జాలీలు పెట్టించకపోడంతో దోమలు కుట్టి విద్యార్థులు రోగాల బారిన సందర్భాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సర్వత్రా కోరుతున్నారు.

జర్నలిస్టులకు ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

ఎమ్మార్పీఎస్ ఏపీ రాష్ట్ర కార్యదర్శి దుమ్ము వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న దుమ్ము వెంకటేశ్వర్లు

భూపాలపల్లిటౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు క్షమాపణ చెప్పాలని ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి, భూపాలపల్లి జిల్లా ఇన్‌చార్జి దుమ్ము వెంకటేశ్వర్లు మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టులను ప్రెస్‌మీట్‌కు పిలిచి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జి రుద్రారపు రామచంద్ర మాదిగ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా కోఇన్‌చార్జి అంబాల చంద్రమౌళిమాదిగ, నాయకులు బొల్లి బాబు, నోముల శ్రీనివాస్, గాజుల బిక్షపతి, అంతడుపుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పలువురి ఖండన

జర్నలిస్టులపై ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల పలువురు నేతలు స్పందించారు. డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కొత్తూరి రవీందర్, విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు రాదండి దేవేందర్ తీవ్రంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో పత్రికల స్వేచ్ఛకు భంగం కలిగించడం సరికాదన్నారు.

అనుచిత వ్యాఖ్యలు సరికాదు : బీజేపీ

రేగొండ, జూలై 22(ఆంధ్రజ్యోతి) : ప్రజల శ్రేయస్సు కోసం పని చేస్తున్న విలేకరులపై ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిశీధర్‌రెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే కాంగ్రెస్‌పై వ్యతిరేకత మొదలైందని, స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీకి గుణపాఠం తప్పదని అన్నారు. ఇప్పటికైనా అహంకార పూరిత వైఖరి మానుకుని విలేకరులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు బండి శ్రీనివాస్, జిల్లా నాయకుడు తిరుపతిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు శివకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్, బూత్ అధ్యక్షుడు విక్రమ్, నాయకులు రాజ్‌కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో వైద్య శిబిరాలు

వెంకటాపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీనగరం గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం జరిగింది. ఈసందర్భంగా వైద్యాధికారి భాస్కర్ విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శిబిరంలో సిబ్బంది ఆదిలక్ష్మి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

● కన్నాయిగూడెం (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రెండు ఆశ్రమ పాఠశాలల్లో వైద్యాధికారి అభినవ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఏహెచ్ఎస్ కన్నాయిగూడెం, ఏయూపీఎస్ తుపాకులగూడెంలో జ్వర పీడితులను పరీక్షించారు. జ్వరంతో బాధడుతున్న విద్యార్థులకు ఆర్టీటీ టెస్టులు చేసి మందులు పంపిణీ చేశారు. ఇతర చిన్న జబ్బులకు కూడా చికిత్స అందించామని వైద్యాధికారి అభినవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సుజాత, ఏహెచ్ఎస్ ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్, ఎంసీహెచ్ స్టాఫ్ నర్సు మంజుల, ఏఎన్ఎంలు కవిత, సబిత, ఆశ వర్కర్లు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

● కాటారం (ఆంధ్రజ్యోతి):మండలంలోని మేడిపల్లిలో ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నతపాఠశాలలో మంగళవారం ఆర్‌బీఎస్‌కే(రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమ్) ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది వైద్యశిబిరం నిర్వహించారు. 80మంది విద్యార్థినులకు రక్తహీనత, కళ్లు, దంత పరీక్షలు చేసి చికిత్సనందించి మందులు పంపిణీ చేశారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బండి శ్రీనివాస్, డాక్టర్ సుజాత, పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్‌రెడ్డి, ఏఎన్ఎంలు జమున, లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్లు కీలకంగా వ్యవరించాలి

(5వ పేజీ తరువాయి)

ఉంచాలని, నాణ్యమైన భోజనం, విద్య అందించేందుకు కృషిచేయాలని అన్నారు. జిల్లాల్లో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్లకు సూచించారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఇప్పటి వరకు 200కోట్లమంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారని, ఈసందర్భంగా జిల్లాల్లోని అన్ని బస్‌స్టేషన్లలో వేడుకలు నిర్వహించాలన్నారు. భూభారతిలో నమోదైన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో విరివిగా మొక్కలు నాటాలని అన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో భూపాలపల్లి డీఎఫ్‌వో నవీన్ రెడ్డి, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయ లక్ష్మి, డీఆర్‌డీవో బాలకృష్ణ, ఆర్‌జేడీ జగన్, డీపీఆర్‌వో శ్రీనివాస్ రావు, ములుగు ఆర్డీవో వెంకటేశ్వ డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్, డీఎంహెచ్‌వో గోపాల్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, డీఈవో చంద్రకళ, ఎస్సీ వెల్ఫేర్ అధికారి లక్ష్మణ్‌కుమార్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.